బావని కాదని
మరొకరిపై
మనసు పడిన
ఆమె ప్రేమ
ఫలించిందా?

# అమృతవీణ

భావన
కథ

ఆకాశం వినీలంగా, విశాలంగా, ప్రశాంతంగా నీలాగే...

భూమి, అసమతలంగా, అనిశ్చలంగా, గందరగోళంగా నాలాగే...

రెండూ కలిసినట్లు కనిపిస్తూ కలవకుండా వుంటాయి... మనలాగే!

నిన్నెప్పుడు కలిసినా నాకొకటే అన్పిస్తుంది. మన పరిచయం ఈనాటిది కాదు, కొన్ని యుగాలు కలిసేవున్నామన్న భావన. నా మనసు నీకు అర్థమయ్యేలా నేనేం చెయ్యను నువ్వు వచ్చే క్షణం వరకు ఆశల అగరువత్తులు వెలిగించుకుని నిశ్శబ్దాల గదిలో ఒంటరిగా వేచివుంటాను. వెదురు హృదయంలో వేణురాగాలు ప్రణమించే ప్రణయునిలా నీవు వస్తావు. ఎంత చిత్రం అప్పటిదాకా నీతో చెప్పాలని ప్రతి నిమిషమూ నాతో చెప్పుకున్న మాటలన్నీ మర్చిపోయినదానిలా నీ సమక్షంలో మూగబోతాను. నీకూ నాకూ అవసరంలేని వ్యర్థపదాలతో కాలాన్ని దొర్లించి నువ్వెళ్ళిపోయాక చెప్పాలనుకున్నది చెప్పలేకపోయానని అప్పుడు గుర్తొచ్చి నిశ్చలమై నిరాశ ధ్యాసతో మూగబోతుంది నా మనసు.

ఎదురరయనివేళవచ్చి ఇట్టె మాయమౌతావు
నీ పదముల బంధింపలేను హృదయము
సంకెలజేసి!

"టంగ్ టంగ్" కాలింగ్ బెల్ మోతతో ఈ లోకంలోకొచ్చాను.

"టంగ్ టంగ్ టంగ్" ఈసారి మరీ గట్టిగా మోగింది.

ఉలిక్కిపడి ఒక్క ఉదుటున ముందు గది చేరి తలుపుతీశాను.




"ఇదేమిటే, పగటిపూట ఇంత మొద్దునిద్రేమిటి?" విసుక్కుంటూ లోపలికి వచ్చింది అమ్మ.

తను లోపలికి వచ్చినా తలుపు వేసి రాకుండా అక్కడే నిలబడి చూస్తున్న నన్ను చూసి "లోపలికి రావేమే!" అని చిత్రంగా చూసింది. చిన్నగా నవ్వేసి నా రూమ్‌లోకి వెళ్లిపోయాను. కృష్ణశాస్త్రిగారి అమృతవీణ

చేతిలోకి తీసుకున్నాను.

"ఒక్కసారి వింటే నీపేరే
ఊగిపోయెనే నా మనసు!
ఉండలేదురా మనసు!"

'శశాంక' ఆ పేరు తలచుకోగానే అప్రయత్నంగా పెదాలపైన చిరునవ్వు మొలిచింది. శశాంక అంటే నాకెందుకింత ప్రేమ? లేదు ఆ పదం చాలా చిన్నది. అంతకంటే సరైన పదం ఏదో వుండాలి. అవును, శశాంక అంటే నాకు ప్రేమకాదు. ఆరాధన. ఒక మనిషి మరో మనిషిని ఎందుకు ప్రేమిస్తాడు? ఆరాధిస్తాడు? వీటికి నిర్వచనాలు ఎన్ని చెప్పగలరో కారణాలూ అన్ని చెప్పగలరు. నేనుమాత్రం నాకోసం నేను జీవించడంకోసం ఎంత అవసరమో నేను జీవించడానికి తనను ప్రేమించడం అంత అవసరమనిపిస్తుంది. తనని తలచుకోని రోజున ఈ గుండె ఆగిపోతుందేమో! నా మనసు ఒక్క వెన్నెల కిరణం సోకినా ఝల్లున పలికే స్వరాల వీణగా మారిందని, ఒక్క గాలి చినుకు తాకినా జలజల కురిసే మేఘాల కలలా మారిందనీ... అతనికెలా తెలుస్తుంది?

"పుస్తకం తిరగేసి పట్టుకుని ఏం చేస్తున్నావే?" అమ్మ వచ్చింది. గబుక్కున పుస్తకాన్ని సరిగ్గా పట్టుకుని "ఏంటమ్మా" అడిగాను.

"ఏంలేదు! మామయ్య ఉత్తరం రాశాడు శుక్రవారం వస్తారట. రేపు నువ్వు కాలేజి మానెయ్యి!"

"ఎందుకమ్మా!"

"ఎందుకేమిటే? మామయ్య డబ్బు పంపించాడు. నీకు పెట్టాల్సిన చీరని నువ్వే సెలక్ట్ చేసుకుంటే బావుంటుందని. రేపు బజార్‌కి వెళ్దాం!"

"చీరేంటి? మామయ్య పెట్టడమేమిటి ? ఏంటమ్మా ఇదంతా" చిరాగ్గా అడిగాను.

"ఏంటి? ఏం తెలియనట్టూ! శుక్రవారం వాడు నీకు, బావకు తాంబూలాలు పుచ్చుకుంటున్నాం. చాలా?" అంతకంటే చిరాగ్గా చెప్పి లేచింది.

నెత్తిన పిడుగు పడ్డట్టయింది. ఎప్పుడో ఈ ప్రస్తావన వస్తుందని తెల్సుగానీ, ఇంత త్వరగా ముంచుకొస్తుందని తెలియలేదు. ఈ సంవత్సరం పూర్తయితే పి.జి అవో మరొకటవో నాయిదా వేద్దామనుకున్నాను. నేను పుట్టినప్పుడే బావ పెళ్లాన్నయ్యానట. అందరికీ ఇష్టమే! నాకు తప్ప. మొన్న వేసవి సెలవుల్లో వెళ్లినప్పుడు ఇలా నిర్ణయించేసుకున్నారన్నమాట. అమ్మ ఎప్పుడు ఈ ప్రస్తావన తెచ్చినా దాటవేసేదాన్ని జరిగినప్పుడు చూద్దాం ఇప్పట్నించే గొడవెందుకని. ఇప్పుడదే నా కొంప ముంచబోతోంది. ఎలాగైనా అమ్మమ ముందు మంచి చేసుకోవాలి.

వంటింట్లో సీరియస్‌గా పన్జేసుకుంటోంది. అక్కడే అరుగెక్కి కూర్చుని "అది కాదమ్మా! పెళ్లికి ఇప్పుడే ఏం తొందర. డిగ్రీ పూర్తవ్వాలి. పి.జి చెయ్యాలి. ఓ ఉద్యోగం చూసుకోవాలి ఆ తర్వాత పెళ్లి" అన్నాను.

"తొందర నీకు కాదమ్మా. నాకు. ఎంత తొందరగా నా బాధ్యత తీరితే అంత మంచిది" సీరియస్‌గానే అంది అమ్మ.

"అర్థం చేసుకోమ్మా! ఈ కాలంలో డిగ్రీకూడా పూర్తికాకుండా పెళ్లిచేసుకుంటే

ఎంత కష్టమో తెల్సా!'' మనసులోనే పడే బాధ కన్పించకుండా బింకంగా అన్నాను.

''అది ఉద్యోగం చేయాల్సిన అవసరం ఉన్నవాళ్లకి. నీకు కాదు. బావ నెలకు నాలుగు వేల పైనేసంపాదిస్తున్నాడు''

''కానీ అమ్మా...'' ఎందుకో చెప్పలేక ఆగిపోయాను.

''ఇంకేం చెప్పద్దు! అనవసరంగా గొడవ పెట్టకు!'' ఉరిశిక్ష ఖరారు చేసిన జడ్జిలా అంది అమ్మ.

కంట్లో సుడి తిరిగిన నీరు తన కంటపడకుండా నా రూమ్‌లోకొచ్చిపడ్డాను. మనసుచుట్టూ ముక్క ముక్కగా అల్లుకుంటున్న దిగులు మేఘం.

☆ ★ ☆

''హాయ్, సుమా! హలో! ఆంటీ!'' ఉత్సాహం ఊపిరిలా వచ్చాడు శశాంక.

''ఏం బాబూ బాగున్నావా? బొత్తిగా నల్లపూసయిపోయావ్! అమ్మ వాళ్లంతా కులాసా? ఒకే ఊళ్లో వుంటున్నాం. చిన్నప్పట్నించీ స్నేహితులం. కానీ ఈనాటికి నెలకోసారన్నా కలవలేకపోతున్నాం! ఏం జీవితాలో'' లోపల్నుంచి వచ్చింది అమ్మ.

''అంతా బాగున్నారు ఆంటీ! అమ్మకూడా ఎప్పుడూ మీ గురించే అనుకుంటూ వుంటారు'' అంటూ నావైపు తిరిగి ''ఏయ్ సుమా! అలా నిలబడిపోయావేంటీ? ముందు కాస్త మంచినీళ్లిచ్చి, ఆ చేత్తోటే నీ స్పెషల్ ఇలాచీ టీ ఇస్తే ఈ జీవుడు ధన్యుడవుతాడు''

ఇంటికెవరొచ్చినా అమ్మే చూసుకుంటుంది. ఒక్క శశాంకకి మాత్రం నేను స్వయంగా ఇలాచి వేసి టీ చేస్తాను. తనకి ఆ టీ చాలా ఇష్టం. ఈరోజు ఎలాగైనా శశాంకకి నా మనసులోని మాట చెప్పాలి. ఇప్పటికే ఆలస్యమైపోయింది. ఇంకా ఆలస్యమైతే లాభంలేదు. ఏమని చెప్పాలి? అసలు ఎలా మొదలుపెట్టాలి? టీ, స్నాక్స్‌తో నేను హాల్లోకి వచ్చేసరికి అమ్మ ''నువ్వేనా చెప్పుబాబూ! వేలకువేలు పోసినా సరైన సంబంధం

## బిచ్చగాడు



సినిమా థియేటర్లో తన పక్కనున్న వ్యక్తిని అడిగాడు వరంధామం.

''ఉదయం బస్టాండ్‌లో భిక్షమడుగుతూ కనిపించావ్. ఇప్పుడు సినిమా థియేటర్‌లో కూర్చున్నావే''

''మీరు వేసిన పది పైసలు కావాలంటే తిరిగి ఇచ్చేస్తాను. మరీ ఇలా అడక్కండి''

—కె.వి.మధుసూదన్‌రావు (కాకినాడ)

రాని ఈ రోజుల్లో అయిన సంబంధాన్ని రెడీగా వుంచుకుని ఇది పి.జి.లు, ఉద్యోగాలు అంటోంది'' ఇంకా ఏదో చెప్పబోతోంటే కంగారుగా —

''అమ్మా! ఇక చాల్లే!'' శశాంక ముందు గొడవపడ్డం ఇష్టంలేక కాస్త సౌమ్యంగానే అన్నాను.

''ఏంటి సుమా! ఉద్యోగం చేస్తావా?'' నవ్వుతూ అడిగాడు.

''నీకిష్టం లేకపోతే ఎందుకు చేస్తాను'' అదీ... డిగ్రీ పూర్తయ్యాక పి.జి. చేసి...' లోగొంతుకతో సగంలోనే ఆపేశాను.

''చదువుకి పెళ్లి అడ్డమా ఏంటి? తర్వాతైనా చెయ్యొచ్చు''

నేనేం మాట్లాడలేదు. తన కళ్లలోకి చూశాను. అదే స్వచ్ఛత, సౌమ్యతతో నవ్వుతున్నట్లున్న చూపులు. వెంటనే కళ్లు తిప్పుకున్నాను.

''మీరిద్దరూ మాట్లాడుతూ వుండండి మార్కెట్ దాకా వెళ్లొస్తాను'' అంటూ అమ్మ లేచింది.

తన ఆఫీస్ విషయాలు, సినిమాలు, మా కాలేజీ కబుర్లు ఏదో టైము గడవడానిక న్నట్టు. తనతో మాట్లాడుతూనే వున్నా నాలో నేను ఎలా చెప్పాలో రిహార్సల్స్ వేసుకుంటున్నా. చివరికి తెగించి చెప్పాను.

''అమ్మ ఈ సంవత్సరం పెళ్లిచేస్తానంటోంది''

''మంచిదేగా''

''ఎవరికి?''

''ఎవరికేంటి? నీకే! హాయిగా భర్త, పిల్లలూ, సంసారం'' ఆ నవ్వులో కొంటెదనం లేదుకదా!

''నీకూ సంతోషమేనా?''

''అవును మరి! చిన్ననాటి స్నేహితురాలి పెళ్లంటే సంతోషమేకదా!'' నన్నాటపట్టిస్తున్నాడు.

''నీకెలాంటి అమ్మాయంటే ఇష్టం?'' ఇట్నుంచి నరుక్కువద్దామని నా తాపత్రయం.

''నీలాగే! మంచి వ్యక్తిత్వమున్న అమ్మాయంటే!'' ఫర్వాలేదు దగ్గరకొచ్చేశాను. ఇక లైన్ క్లియరైనట్లే.

''మరి పెళ్లెప్పుడు చేసుకుంటావ్?'' నా తొందర నాది!

''వాళ్ల వాళ్లు ఒప్పుకున్నాక''

''అంటే మీ ఇంట్లో ఒప్పుకున్నారా?'' సంతోషంతో మాట ఆడబడుతోంది.

''ఆహా! సంతోషంగా! నా మాటా మా ఇంట్లో కాదంటారా?''

''మరింకెందుకు ఆలస్యం?'' ఒక్క అడుగు దగ్గరగా వేసి అడిగాను.

''ఇంక ఆలస్యం ఏం లేదు! ఇప్పుడొచ్చింది ఆ పనిమీదే! ఇందాకటినుంచీ ఆంటీతో ఎలా చెప్పాలా అని ఆలోచిస్తున్నాను''

''ఏమని?'' నాలో ఉద్వేగం స్థానంలో కొంటెదనం!

''పోయిన సంవత్సరం మీ ఇంట్లో వుండే డిగ్రీ పూర్తిచేసిందే మీ పెదనాన్నగారమ్మాయి మాలతి. తనంటే నాకిష్టం. తనకి కూడా ఇష్టమే! మీ పెదనాన్నగారికి నా తరపున ఆంటీ రికమండ్ చేస్తారేమోనని!'' ఇంకా ఏంటేంటో చెప్తున్నాడు నా చెవులు ఎప్పుడో వినడం మానేశాయి.

సున్నితమైన ఓ అద్దం మీద భళ్లున రాయి విసిరినట్లు హృదయం మీద శరవేగంతో ఆకృతిదాలుస్తున్న పగుళ్లు.

కలలు ధూళిలో కలిసిన చప్పుడు! ఆశల అలలు పొగలి పగిలిన సవ్వడి!

కలల పారాణి ఆరవేలేదు.

ఊహల ఊయల ఆగనైనా లేదు.

మొదటి మజిలీ చేరకముందే

ముగిసిపోయెను ప్రణయ యాత్ర

"జరుగుతుందంటావా?" శశాంక మాటతో తిరిగి చూశాము.

"ఆ... ఏంటి?" స్పృహలో లేనట్లు అడిగాము.

"మా పెళ్లి జరుగుతుందంటావా?"

"తప్పకుండా జరుగుతుంది. బెస్ట్ ఆఫ్ లక్" జారుతున్న కన్నీటి చుక్కను కొనగోటితో చిట్లేస్తూ చెప్పాను.

"ప్రణయభంగ ప్రభూత తాపజ్వరార్తి

నెటుల భరియింతువో సఖా! ఇటులు యనుచు

కడుభీరంబైన వలపుచే తడిసి తడిసి

హృదయమయ్యెను నవనీత మృదులము" అమృతవీణ గుర్తొచ్చింది.

☆ ★ ☆

